# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తూర్పు భారతదేశాన్ని మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ దేశాన్ని ప్రపంచ రక్షణ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.
- ❖ దేశ ఆర్థికాభివృద్ధిలో ఎం.ఎస్.ఎం.ఈ.లు కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ పేర్కొన్నారు.
- ❖ ఢిల్లీ సహా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో రేపటి వరకు తీవ్రస్థాయిలో పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా సింగూరు వేదికగా 830 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బాలాగఢ్‌లో సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న “ఎక్స్‌టెండెడ్ పోర్ట్ గేట్ సిస్టమ్”, ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ (IWT) టెర్మినల్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోల్‌కతాలో అత్యాధునిక “ఎలక్ట్రిక్ కాటమరాన్” నౌకను నరేంద్ర మోదీ ప్రారంభించారు. తారకేశ్వర్ - బిష్ణుపూర్ ప్రాజెక్టులో భాగంగా జయరాంబతి - బారోగోపీనాథ్‌పూర్ - మయనాపూర్ కొత్త రైలు మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రధాని మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… కేంద్రం చేపడుతున్న ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్ అభివృద్ధిని వేగవంతం చేస్తాయని, తూర్పు భారతదేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రక్షణ ఆయుధాలలో వినియోగించే మందుగుండు సామగ్రి తయారీలో సంపూర్ణ స్వయం సమృద్ధిని సాధించడమే కాకుండా, భారతదేశాన్ని ప్రపంచ రక్షణ ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నాగపూర్‌లోని సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన "మీడియం కాలిబర్ మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాన్ని" ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్మేనియా దేశానికి ఎగుమతి చేస్తున్న తొలి విడత "గైడెడ్ పినాక రాకెట్ల"ను కేంద్రమంత్రి జెండా ఊపి పంపించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... త్వరలోనే రక్షణ రంగ తయారీలో ప్రైవేటు సంస్థల వాటాను 50 శాతం లేదా అంతకంటే ఎక్కువకు పెంచుతామని వెల్లడించారు. దేశీయంగా తయారైన ఆయుధాలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతుండటం మన సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) దీర్ఘకాలిక నష్టాల నుంచి గట్టెక్కి లాభాల బాట పట్టాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ సంస్థలు 2 వేల 701 కోట్ల రూపాయల పన్ను అనంతర నికర లాభాన్ని (PAT) నమోదు చేశాయని కేంద్ర విద్యుత్ శాఖ వెల్లడించింది. రాష్ట్ర విద్యుత్ బోర్డుల విభజన, కార్పొరేటీకరణ జరిగిన నాటి నుంచి విద్యుత్ పంపిణీ రంగం వరుసగా నష్టాలనే చవిచూస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో తాజా సానుకూల ఫలితాలు ఆ రంగంలో గణనీయమైన మార్పును సూచిస్తున్నాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థలు ఏకంగా 67 వేల 962 కోట్ల రూపాయల భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. అప్పటితో పోలిస్తే... ప్రస్తుతం 2 వేల 701 కోట్ల రూపాయల లాభాలను ఆర్జించడం విద్యుత్ రంగంలో ఒక మైలురాయిగా కేంద్రం అభివర్ణించింది. ఈ ఫలితాలపై కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మాట్లాడుతూ... ఇది విద్యుత్ పంపిణీ రంగంలో ఒక నూతన అధ్యాయమని కొనియాడారు. డిస్కమ్‌ల సమస్యలను పరిష్కరించడానికి తాము చేపట్టిన సంస్కరణల వల్లనే ఈ విజయం సాధ్యమైందని.. దేశ ఆర్థిక వృద్ధికి విద్యుత్ రంగం వెన్నుముకగా నిలుస్తోందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రయాణీకుల భద్రత సహా రైళ్ల వేగం పెంచే లక్ష్యంతో రానున్న రెండేళ్లలో 7 వేల 900 కిలోమీటర్లకు పైగా రైల్వే ట్రాక్‌లను నవీకరించనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపట్టిన ఈ పనులు శరవేగంగా సాగుతున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 7 వేల 500 కిలోమీటర్ల మేర ట్రాక్‌ల నవీకరణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలోనూ సుమారు 6 వేల 800 కిలోమీటర్ల మేర ట్రాక్ పునరుద్ధరణ పనులను విజయవంతంగా పూర్తి చేసినట్లు మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అస్సాంలోని నాగావన్ జిల్లా కలియబోర్‌లో 6 వేల 950 కోట్ల రూపాయల విలువైన కాజిరంగా ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 86 కిలోమీటర్ల పొడవునా సాగే ఈ జాతీయ రహదారి ప్రాజెక్టు పర్యావరణ హితంగా రూపుదిద్దుకోనుంది. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ప్రధాని మాట్లాడుతూ... కాజిరంగా కేవలం ఒక జాతీయ ఉద్యానవనం మాత్రమే కాదని, అది అస్సాం రాష్ట్ర ఆత్మ అని పేర్కొన్నారు. కాజిరంగా నేషనల్

పార్క్ మీదుగా వెళ్లే 35 కిలోమీటర్ల మేర రహదారిని ఫ్లై ఓవర్ పద్ధతిలో నిర్మిస్తామని, దీనివల్ల వన్యప్రాణుల స్వేచ్ఛా సంచారానికి ఎలాంటి ఆటంకం కలగదని ప్రధాని వివరించారు. గడచిన దశాబ్ద కాలంలో దేశంలో అటవీ విస్తీర్ణం పెరిగిందని, "ఏక్ పేడ్.. మా కే నామ్" ప్రచారం కింద ఇప్పటివరకు 260 కోట్లకు పైగా మొక్కలు నాటారని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి రెండు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆర్థికాభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (MSME) కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఇవి దేశ ప్రగతికి 'వెన్నెముక' వంటివని కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ అభివర్ణించారు. న్యూఢిల్లీలో నిర్వహించిన "పీఎం విశ్వకర్మ హాట్-2026" ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో నిరుద్యోగ సమస్యను అంతం చేసేందుకు పీఎం విశ్వకర్మ యోజన ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. కళాకారులు తమ ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించుకోవడానికి, కొత్త మార్కెట్లను అన్వేషించడానికి 'విశ్వకర్మ హాట్' ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

"వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్)" (వీబీ-జీ-రామ్-జీ) చట్టం కింద కనీస వేతనాల నిర్ణయం ఉండదని, చట్టబద్ధమైన ఉపాధి హామీ కనుమరుగవుతుందంటూ.. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేసింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB)కి చెందిన "ఫ్యాక్ట్ చెక్" విభాగం ఈ వీడియోపై విచారణ చేపట్టి, అది పూర్తిగా అవాస్తవమని తేల్చింది. కార్మికులకు చెల్లించే వేతనాల్లో ఎలాంటి తగ్గింపు ఉండబోదని, గతంలో ఉన్న విధంగానే ఉపాధికి చట్టబద్ధమైన గ్యారెంటీ కొనసాగుతుందని వివరించింది. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు సమాచారాన్ని నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ సహా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో రేపటి వరకు తీవ్రస్థాయిలో పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. మరోవైపు తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తూర్పు ఉత్తరప్రదేశ్ లో  చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వెల్లడించింది. వాయువ్య, మధ్య భారతదేశంలో రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా 2 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల చలి తీవ్రత నుంచి ప్రజలకు స్వల్ప ఉపశమనం లభించే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య మూడో క్రికెట్ మ్యాచ్ ఇండోర్ వేదికగా జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. 338 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 34 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

స్టాక్ మార్కెట్లలో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్ల (FPI) అమ్మకాల ధోరణి కొనసాగుతోంది. కొత్త ఏడాదిలోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణకే మొగ్గు చూపుతున్నారు. డిపాజిటరీల తాజా గణాంకాల ప్రకారం.. ఈ నెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి 22 వేల 530 కోట్ల రూపాయలను వెనక్కి తీసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =